
క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయదశమి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. దసరా పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆ జగన్మాత చల్లని దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, సుఖ శాంతులు, సిరి సంపదలు చేకూరాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మ భక్తులకు వాటర్ బాటిళ్లు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దసరా ఉత్సవాలలో దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు, భవానీలకు శుక్రవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వాటర్ బాటిళ్లు, ఓఆర్‌ఎస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక్, డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, హేమంతరావు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. పుణ్యతిథి మహోత్సవాలలో భాగంగా సాయినాథునికి క్షీరము, గంధంతో అభిషేకం నిర్వహించారు. గోధుమరవ్వ, బొబ్బర్లను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోక కల్యాణార్థం వేద పండితులతో సాయినాథ, వారాహీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

పదకవితకు చిన్నారుల నృత్యాభిషేకం



విజయవాడ కల్చరల్: పద కవితకు చిన్నారులు నృత్యాభిషేకం చేశారు. రామదాసు కీర్తనలకు కళాకారుల అడుగులు నాట్యం చేశాయి. వాగ్గేయకారుల కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యాలు మనోహరంగా సాగాయి. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు, కళాకారుల నృత్యాభినయాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు నృత్యసేవలో తరించారు. శివకుమారి బృందం భక్తి సంకీర్తనలను ఆలపించింది. హనుమంతరావు, యశస్వి, లక్ష్మీప్రసన్న బృందాలు భక్తి పాటలను ఆలపించాయి. నృత్య కార్యక్రమంలో భాగంగా నాట్యాచారిణి వనం లలితా దేవి బృందం వాగ్గేయకారుల కీర్తనలతో సంప్రదాయ నృత్యాలు ప్రారంభమయ్యాయి.ఆర్.యోషిత, కె.స్వాతివాహిని, సీహెచ్‌వీఎస్ కృష్ణ, ఎం.ప్రణతి, సీహెచ్ బాలా త్రిపుర సుందరి, ప్రశాంత్‌కుమార్, బి.దేవర్షిణి, సీహెచ్ ఆవీషా చౌదరి, కె.పావని ప్రియాంక, కె.జోషిత, వై.విజయవల్లి, ఎ.తరుణి, బీఎస్ భారతి, ఎస్.భారతి తమ బృందాలతో పలు అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను సైదా, గంగాధర్, కేఎస్ రామకృష్ణ నిర్వహించారు. నిర్వాహకులు చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుందరయ్య నగర్‌కు చెందిన షేక్ హుస్సేన్(63) గురువారం ఇంట్లో మొదటి అంతస్తు నుంచి కిందికి దిగుతూ జారి పడిపోయాడు. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు హుస్సేన్ కుమారుడు ఆసిఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఎస్పీ సిటీ కన్వీనర్‌గా డేనియల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహుజన సమాజ్ పార్టీ విజయవాడ సిటీ కన్వీనర్‌గా నగరానికి చెందిన పి.డేనియల్ నియమితులయ్యారు.



కృష్ణానదీ తీరాన బాణసంచా వెలుగులు



అర్జున వీధిలో ఏర్పాటు చేసిన కళా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాకారులు



అమ్మవారి విగ్రహంతో భవానీలు




జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు

జగన్మాతా.. కరుణించమ్మా...

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శుక్రవారం శ్రీమహిషాసురమర్దనిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలు ముగియనుండటంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భవానీలు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్మాతా.. కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విద్యుత్ వెలుగులతో ధగధగాయమానంగా ప్రకాశం బ్యారేజీ



అమ్మవారి సన్నిధిలో సినీ నటి అనన్య నాగళ్ళ

సర్వమంగళ దాయనీ శక్తి స్వరూపిణీ...



లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో మహిషాసుర మర్దనిగా...



శివరామకృష్ణ క్షేత్రంలో దుర్గామాతగా అలంకరించిన అమ్మవారు

విజయవాడ కల్చరల్: క్రోధినామ సంవత్సర వార్షిక దసరా మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శారదా మాతను మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు నిర్వహించారు, దుష్ట సంహారిణీ అంటూ భక్తులు అమ్మవారి రూపం చూసి తరించిపోయారు. శివరామకృష్ణ క్షేత్రంలో శారదా మాతను దుర్గామాతగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మాధికారి శిష్లా హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్దని అవతారంలో అమ్మవారు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో మహిషాసుర మర్దనిగా...



శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో మహిషాసుర మర్దనిగా...



దావు బుచ్చయ్యకాలనీలో.. మహిషాసుర మర్దనిగా...



దుర్గాపురంలో మహిషాసుర మర్దనిగా...

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీ మహిషాసుర మర్దని అలంకారం చేసి పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ చేతుల మీదుగా లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించారు.

రామలింగేశ్వరపేటలో...

రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక అర్చనలు జరిగాయి.



జీవీఆర్‌నగర్‌లో...

ముత్యాలంపాడులో...

ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దనిగా పూజలు అందుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

బావాజీపేటలో...

బావాజీపేటలో బచ్చుమాధవీకృష్ణ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీమహిషాసుర మర్దనిగా అలంకరించి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చు మురళి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

దుర్గాపురంలో...

దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యాన శ్రీదేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దని గా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు.

వాడవాడలా...


సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధురానగర్ మెయిన్ రోడ్డు, నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, రామకృష్ణాపురం శ్రీ దుర్గా భవానీ మందిరంలో అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు చేశారు. జీవీఆర్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

నత్తనడకన వాటర్ ట్యాంక్ నిర్మాణం



తుప్పు పట్టిన ఐరన్

- మూడేళ్లుగా సా...గుతున్న పనులు
- కృష్ణా వాటర్ అందుబాటులోకి వచ్చేదెప్పటికో?



జీవీఆర్ నగర్‌లో వాటర్ ట్యాంక్

మధురాననగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంత వాసులకు కృష్ణా జలాలు అందించేందుకుగానూ సుమారు మూడు సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు అమృత్ పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.3.3 కోట్లు, వాటర్ పైపులైన్ పనులకు రూ.3.29 కోట్లు నిధులు మంజూరు చేశారు. వాటర్ పైపులైన్ పనులు రెండేళ్ల క్రితమే పూర్తయ్యాయి. గుణదల గంగిరెద్దుల దిబ్బ నుంచి ఇక్కడి వరకు ప్రధాన పైపులైన్ పనులు సైతం పూర్తి చేశారు. అయితే ఇక్కడ ప్రభుత్వానికి సెంటు భూమి కూడా లేకపోవటంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం సమస్యగా మారింది. దీంతో స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులు, స్థానికులతో మాట్లాడి బాండ్లు ఇచ్చి ప్రైవేటు స్థలం సేకరించారు. అనంతరం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. వేసవి నాటికి కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టారు. అయితే ఇంతలో ఎన్నికలు రావటంతో పాటు ప్రభుత్వం మారటంతో ఇక్కడ నిర్మాణ పనుల్లో వేగం తగ్గింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో వచ్చే వేసవినాటికైనా వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తవుతుందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తిచేసి కృష్ణాజలాలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనుల హక్కుల కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన పట్టాభి

సంస్మరణ సభలో వక్తలు



సింగం పట్టాభి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన, ఉద్యోగ సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గిరిజనుల హక్కుల కోసం సింగం పట్టాభి అవిశ్రాంతంగా కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. సింగం పట్టాభి జానకమ్మ సేవా ట్రస్ట్ నెలకొల్పి గిరిజనుల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారన్నారు.శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం , ఆంధ్రప్రదేశ్ ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజనరత్న సింగం పట్టాభి సంస్కరణ సభ జరిగింది. సంస్మరణ సభలో ఆయా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పాల్గొని సింగం పట్టాభి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో కొండారెడ్డి నరహరి వరప్రసాద్, ఎం.గురునాథం తదితరులు మాట్లాడుతూ సింగం పట్టాభి సేవలకు ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రకటించాలని కోరారు. భావితరాలకు స్ఫూర్తి నింపేలా ఆయన విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టాభి జీవిత చరిత్ర పుస్తక రూపంలో ముద్రించాలన్నారు. పట్టాభి తనయుడు సత్యనారాయణ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయ,సహకారాలు అందించామన్నారు. సభలో పలు గిరిజన, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్నానఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులు స్నానఘాట్ల వద్ద వదిలే వస్త్రాలను ఎప్పటికప్పుడు కన్వేయర్ బెల్ట్ ద్వారా ఒడ్డుకు తీసుకురావాలని, అక్కడి నుంచి వెంటనే వాటిని తరలించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సీతమ్మ పాదాలు వద్ద ఉన్న కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలిస్తున్న వస్త్రాలను పరిశీలించారు. దసరా నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నవరాత్రులలో విజయవాడ నగరపాలక సంస్థ వారు చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోటు లేకుండా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తూ, తాగునీరు అందించడంలో లోపం లేకుండా క్యూలైన్ల వద్దనే అందిస్తుండాలని అధికారులను ఆదేశించారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): పేదలకు సేవచేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ ఉండదని మాజీ జమాక్ స్టోర్స్ చైర్మన్ కత్తిక శివనాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆటో నగర్‌లోని ఏపీఎంఎస్ ఎంఈ కార్యాలయ ఆవరణలో ఆయన చేతుల మీదుగా ఐలా పారిశుధ్య కార్మికులు 70 మందికి రూ.70 వేలు విలువైన దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ శ్రీశాంతి, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

కుందా వారి కండ్రికలో కార్పొరేటర్ పూజలు



కండ్రికలో పూజ చేస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కుందావారి కండ్రికలో యాదవుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం 64వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పూజలు చేశారు. దుర్గమ్మను శ్రీమహిషాసురమర్దినిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిరుపతమ్మ స్థానిక మహిళలతో కలసి పూజలో పాల్గొన్నారు. అర్చకుడు రొంపిచర్ల లోకాభిరామ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వేదాల్లో అనంతమైన విజ్ఞానం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



లబ్బీపేట(విజయవాడతూర్పు): వేదాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు అని, మన పూర్వీకులు అందించిన వేదాల్లో అనంతమైన విజ్ఞానం దాగి ఉందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మల్లాది వేంకట సుబ్బారావు – బాలత్రిపుర సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని తన స్వగృహంలో శుక్రవారం వేద సభ నిర్వహించారు. నవరాత్రులలో మహర్నవమికి ఎంతో విశిష్టత ఉందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. దేశంలో వేల సంవత్సరాల నుంచి వేద విజ్ఞానం పరిఢవిల్లుతోందని చెప్పారు. వేదం భగవంతుని స్వరూపమని, విశ్వమానవ శ్రేయస్సు కోసమే భగవంతుడు వేదాలను సృష్టించాడని పేర్కొన్నారు. వేద పారాయణం జరిగే చోట సాక్షాత్తూ అమ్మవారు కొలువై ఉంటారని చెప్పుకొచ్చారు. ఆ జగన్మాత దివ్య ఆశీస్సులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పైన, రాష్ట్ర ప్రజలందరిపైన ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం వేద పండితులు, ఘనాపాఠిలను సత్కరించారు. కార్యక్రమంలో మల్లాది రాజేంద్ర, మల్లాది శ్రీనివాస్, శర్వాణి మూర్తి, మల్లెం శ్రీను, యల్లాప్రగడ సుధీర్, వేద పండితులు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ, దుర్భాకుల గురునాథ , విష్ణుభట్ల వేంకట సుబ్రహ్మణ్య , రెండుచింతల యజ్ఞనారాయణ , హరి సీతారామశర్మ, దెందుకూరి సదాశివ సోమయాజి, మంగిపూడి వేంకటశాస్త్రి , హరీష్ , దెందుకూరి శ్రీ రామ పాల్గొన్నారు.

రతన్‌టాటా జీవితం ఆదర్శప్రాయం



విజయవాడ కల్చరల్: మానవతా మూర్తి రతన్‌టాటా జీవితం ఆదర్శప్రాయమని జీఆర్‌కే పోలవరపు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. సాహితీ, కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం సంస్మరణ సభను నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ టాటా సంస్థను దేశ విదేశాలకు విస్తరించిన దార్శనికుడు రతన్ టాటా అని అభివర్ణించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ రతన్ టాటాకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన కె.డేవిడ్‌రాజు, బోడి ఆంజనేయరాజు, సింగంశెట్టి చంద్రశేఖర్, గాయకులు ప్రిన్స్, ఆదిరాల జయప్రభ, కారుమంచి రాజు పాల్గొన్నారు.





